సాక్షి మెదక్

ఆదివారం । 27 । అక్టోబర్ । 2024



పట్టపగలే చోరీ

పట్టపగలే దొంగలు చోరీకి పాల్పడిన ఘటన చిన్నశంకరంపేట మండలం మిర్జాపల్లిలో చోటు చేసుకుంది. వివరాలు IIలో ▸



నిలిచిపోయిన రోడ్డు పనులు

రోడ్డు మరమ్మతులు నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వివరాలు IIIలో ▸

జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రమైన చేగుంటలో జిల్లాస్థాయి క్రికెట్ పోటీలను తహసీల్దార్ నారాయణ శనివారం ప్రారంభించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన జట్లకు నగదు ప్రోత్సాహకం అందిస్తామని వాలీబాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పరంజ్యోతి తెలిపారు.

న్యూస్‌రీల్

నిబంధనలు తప్పనిసరి

ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి



మెదక్ మున్సిపాలిటీ: దీపావళి పండుగ సందర్భంగా టపాసుల దుకాణదారులు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి సూచించారు. శనివారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఆయన మాట్లాడారు. నిబంధనలు పాటించకుండా దుకాణాలు ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమాచారం కోసం సంబంధిత డివిజనల్ స్థాయి అధికారిని సంప్రదించాలన్నారు. టపాసుల దుకాణాలను బహిరంగ ప్రదేశాల్లో ఏర్పాటు చేయాలని, ఇందుకు సంబంధించి ఎన్‌ఓసీ తీసుకోవాలని తెలిపారు. ఒక క్లస్టర్‌లో 50 షాపులకు మించకుండా ఉండాలన్నారు. అన్ని జాగ్రత్తలు తప్పక పాటించాలన్నారు.

మెదక్ మున్సిపల్ కమిషనర్‌గా శ్రీనివాస్‌రెడ్డి



మెదక్‌మున్సిపాలిటీ: మెదక్ మున్సిపల్ కమిషనర్ జానకీరాంసాగర్ శనివారం హైదరాబాద్‌కు బదిలీ అయ్యారు. ఈమేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జహీరాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి బదిలీపై మెదక్‌కు వచ్చారు.

హరీశ్‌రావును కలిసిన ఎమ్మెల్యే సునీతారెడ్డి



హరీశ్‌రావుతో ఎమ్మెల్యే, నాయకులు

నర్సాపూర్: మాజీ మంత్రి హరీశ్‌రావును ఎమ్మెల్యే సునీతారెడ్డి శనివారం హైదరాబాద్‌లోని ఆయన ఇంట్లో కలిశారు. నియోజకవర్గంలో పార్టీ పరిస్థితితో పాటు ఇతర అంశాలపై చర్చించారు. ఆమె వెంట నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, బబియానాయక్, నర్సాగౌడ్ తదితరులు ఉన్నారు.

రియల్ అనాలసిస్‌పై శిక్షణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న అధ్యాపకులు

మెదక్ కలెక్టరేట్: మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం రియల్ అనాలసిస్‌పై విద్యార్థులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ హుస్సేన్ తెలిపారు. ఇందుకు సంబంధించిన బ్రోచర్‌ను శనివారం కళాశాలలో ఆవిష్కరించి మాట్లాడారు. తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ కళాశాల, గణిత శాస్త్ర విభాగం సంయుక్తంగా శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తుందన్నారు. ఓయూ రిటైర్డ్ ప్రొఫెసర్ గోవర్ధన్, అసోసియేట్ ప్రొఫెసర్ కిరణ్, రిసోర్స్ పర్సన్లుగా హాజరవుతున్నట్లు చెప్పారు.

ఐటీఐలో దరఖాస్తు చేసుకోండి

నారాయణఖేడ్: పటాన్‌చెరు ప్రభుత్వ ఐటీఐలో ఈ విద్యాసంవత్సరానికి సంబంధించి 7వ విడత వాక్ ఇన్ అడ్మిషన్ల కోసం నోటిఫికేషన్ జారీ చేసినట్లు ఐటీఐ ప్రిన్సిపాల్ ఎన్.శ్రీనివాస్ తెలిపారు. శనివారం ఆయన నారాయణఖేడ్‌లో విలేకరులతో మాట్లాడారు. అడ్మిషన్ దరఖాస్తులు ఆన్‌లైన్‌లో ఈనెల 30వ తేదీ ఉదయం 11గంటల వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లను, ఎస్‌ఎస్‌సీ మెమో, టీసీ, ఆధార్, ఆన్‌లైన్‌లో ఫొటో, మొబైల్ నంబరుతో సహా స్కాన్ చేసి అప్‌లోడ్ చేయాలని అన్నారు. 30న మధ్యాహ్నం మూడు గంటల్లోపు పటాన్‌చెరు ప్రభుత్వ ఐటీఐలో ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకొని హాజరు కావాలని ఆయన కోరారు.

రేపు జాబ్ మేళా

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని ఆచార్య డిగ్రీ కళాశాలలో ఈ నెల 28న టాస్క్ (తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్) ఆధ్వర్యంలో జాబ్‌మేళ నిర్వహిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ చింతల హరికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని ఎంఎస్ఎన్ లాబరేటరీలో ఉద్యోగాల కల్పన కోసం డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. డిగ్రీలో ఎంపీసీ, బీజెడ్‌సీ తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు అర్హులన్నారు. జాబ్‌మేళకు హాజరయ్యే వారు రెస్యూమ్, పాస్‌సైజ్ ఫొటోతో ఉదయం 9 గంటలకు హాజరుకావాలని కోరారు. అన్ని కళాశాలలోని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

స్మార్ట్ బాయ్స్

పట్టణాలకు పాకిన ఈ–కామర్స్





- కాలంతో పరుగెడుతున్న 'డెలివరీ బాయ్స్'
- ఆర్డర్ పెట్టిన నిమిషాల్లో ఇంటి ముందుకు..
- గిగ్ వర్కర్లను డెలివరీ పార్ట్‌నర్స్‌గా మాత్రమే గుర్తింపు
- ఏ పనీ దొరకని నిరుద్యోగులకు ఉపాధి
- ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా 2 వేల మందికి పైగానే డెలివరీ బాయ్స్

ఇంటర్నెట్‌తో ప్రపంచం గ్లోబల్ విలేజ్‌గా మారిపోయింది. పుస్తకాల అమ్మకాలతో గెలుపుబాట పట్టిన ఈ కామర్స్ బిజినెస్ ఇప్పుడు అంతటా వ్యాపించింది. బుక్, ఫుడ్, ఫోన్, కాస్మొటిక్స్, మెడిసిన్స్, ఫర్నిచర్, హోం అప్లయన్సెస్ ఒకటేమిటీ సర్వం ఇక్కడ లభిస్తున్నాయి. మనం ఫోన్‌లో ఆర్డర్ పెడితే మన ఊరి పిల్లలే మన ఇంటి ముందుకు తెచ్చి ఇస్తున్నారు. ఈ కామర్స్‌తో డెలివరీ బాయ్ రూపంలో సరికొత్త ఉపాధి అందుబాటులోకి వచ్చింది. అయితే తనతో పాటు కొన్ని ఇబ్బందులు కూడా మోసుకొచ్చింది. ఇప్పుడు వాటికి పరిష్కార మార్గాలు చూపి గిగ్‌వర్కర్లకు భరోసా కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. IIలో

గజవెల్లి షణ్ముకరాజు, సాక్షి సిద్దిపేట

ఇక అన్నీ ఆడదూడలే..

'గోకుల్ మిషన్'తో పాడి కళకళ

- కృత్రిమ గర్భధారణతో 90 శాతం ఆడదూడలు
- రాష్ట్రంలో ఉమ్మడి మెదక్ జిల్లా ప్రథమ స్థానం



చిన్నశంకరంపేట: గేదెలకు కృత్రిమ గర్భధారణ చేస్తున్న సిబ్బంది (ఫైల్)

మెదక్ కలెక్టరేట్: గ్రామీణ ప్రాంత ప్రజలకు పంటల సాగుతో పాటు పాడి పశువుల పెంపకం రెండో ఆదాయం. ఇటీవల వ్యవసాయంలో యాంత్రీక విధానం రావడంతో పశువులకు మేత దొరకడం లేదు. దీంతో రైతులు పాడి పశువుల పెంపకాన్ని తగ్గిస్తున్నారు. ఫలితంగా పశువుల సంఖ్య తగ్గిపోతూ వస్తోంది. దీన్ని గుర్తించిన కేంద్రం పశుజాతి అభివృద్ధికి 'రాష్ట్రీయ గోకుల్ మిషన్' పథకాన్ని తీసుకొచ్చింది. ఈ పథకం కింద గేదెలకు కృత్రిమ గర్భధారణ ద్వారా 90 శాతం ఆడ దూడలు జన్మించేలా హైబ్రిడ్ సిరం తీసుకొచ్చింది. ఉమ్మడి మెదక్ జిల్లాలో పశుగణాభివృద్ధి సంస్థ ఈ పథకాన్ని అమలు చేయడంలో ముందంజలో ఉంది.

1,452 గేదెలకు కృత్రిమ గర్భధారణ

జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ ఏడాది జూన్ నుంచి ఉమ్మడి మెదక్ జిల్లాలో కృత్రిమ గర్భధారణ పథకాన్ని అమలు చేస్తున్నారు. మెదక్, సంగారెడ్డి, సిద్దిపేటలో ఇప్పటివరకు మొత్తం 1,452 గేదెలకు కృత్రిమ గర్భధారణ చేశా రు. దీంతో ఉమ్మడి మెదక్ జిల్లా రాష్ట్రంలోనే మొదటిస్థానంలో నిలిచింది. కృత్రిమ గర్భధారణ ద్వారా 90 శాతం ఆడ దూడలే పుట్టే అవకాశం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఫలితంగా పశు సంపద గణనీయంగా పెరుగనుంది. మరోవైపు పాల దిగుబడి అధికంగా రావడంతో పాటు పాడి రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందే అవకాశం ఉంది.

క్షేత్రస్థాయిలో గోపాలమిత్రలు

పశుగణాభివృద్ధి సంస్థలో పనిచేసే గోపాల మిత్రలు క్షేత్రస్థాయిలో పర్యటించి గ్రామీణ ప్రాంత రైతులకు కృత్రిమ గర్భధారణపై అవగాహన కల్పిస్తున్నారు. ప్రభుత్వం అందించే సబ్సిడీలను రైతులకు తెలియజేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 140 మంది గోపాల మిత్రలు పాడి పశువుల అభివృద్ధికి కృషి చేస్తున్నారు. గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించడంతో పాటు కృత్రిమ దూడల ప్రదర్శన, పాల దిగుబడి పోటీలు నిర్వహిస్తున్నారు.

అతి తక్కువ సమయంలోనే..

కృత్రిమ గర్భధారణ ద్వారా జన్మించిన ఆడ దూడలు కేవలం మూడేళ్లకే మరో దూడకు జన్మనిస్తాయి. ఫలితంగా రైతులకు అతి తక్కువ సమయంలో పాల దిగుబడితో ఆదాయం సమకూరుతుంది. ఈ పథకానికి జాతీయ పాడి పరిశ్రమ అభివృద్ధి సంస్థ నోడల్ మానిటరింగ్ ఏజెన్సీగా వ్యవహరిస్తుంది.

రైతులకు ఎంతో మేలు



కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన రాష్ట్రీయ గోకుల్ మిషన్ పథకాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలి. గేదెలకు కృత్రిమ గర్భధారణ కోసం ఉమ్మడి మెదక్ జిల్లాకు 2,800 సిరం స్టాక్ వచ్చింది. కృత్రిమ గర్భధారణ ద్వారా మేలుజాతి దూడలు జన్మిస్తాయి. ఈ దూడలు అధిక పాలు ఇస్తాయి. మేలు జాతి పశువులకు బహిరంగ సంతలో అత్యధిక విలువ ఉంటుంది. కృత్రిమ గర్భధారణకు ఒక పశువుకు రూ.650 కాగా.. ఇందులో రూ.400 కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ ఇవ్వగా, రైతు కేవలం రూ. 250 చెల్లిస్తే సరిపోతుంది.

– రాంజీ, సీఈఓ, పశుగణాభివృద్ధి సంస్థ, ఉమ్మడి మెదక్ జిల్లా

మందుల దందా..!

ఇష్టారాజ్యంగా విక్రయాలు

- నిబంధనలు బేఖాతరు
- కానరాని జనరిక్ మెడికల్ షాపులు



మెదక్ పట్టణంలో గతంలో కొనసాగిన జనరిక్ మెడికల్ షాపు (ఫైల్)

మెదక్‌జోన్: మెడికల్ మాఫియా రోగులను నిలువు దోపిడీ చేస్తుంది. 30 శాతం ధరలకు లభించే జనరిక్ మందులను ఎతికల్ మందుల మాదిరిగా వందశాతం ధరకు విక్రయిస్తున్నారు. జిల్లా కేంద్రంలో గల 30 మెడికల్ షాపులు నెలకు రూ. 3 కోట్ల మందుల విక్రయాలు జరుపుతున్నారు. కాగా తక్కువ ధరకు లభించే జనరిక్ మెడికల్ షాపులు జిల్లాలో లేకపోవడంతో ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారు.

నెలకు రూ. 3 కోట్ల విక్రయాలు

జిల్లావ్యాప్తంగా మొత్తం 2 వందల పైచిలుకు మెడికల్ షాపులు ఉండగా, జిల్లా కేంద్రంలో 30 వరకు ఉన్నాయి. వాటిలో 95 శాతం జనరిక్ మందులనే విక్రయిస్తున్నారు. అవి బహిరంగ మార్కెట్‌లో 30 శాతం ధరలకు లభించగా, వందశాతం లాభాలకు విక్రయిస్తూ నిలువు దోపిడీ చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పేదలకు తక్కువ ధరకు మందులు అందుబాటులో ఉండేలా కేంద్ర ప్రభుత్వం గతంలో జనరిక్ మెడికల్ షాపులను అందుబాటులోకి తెచ్చింది. ఇతర మెడికల్ షాపుల్లో లభించే జనరిక్ మందుల ధరతో పోలిస్తే కేవలం 30 శాతం ధరకు మాత్రమే లభిస్తాయని సంబంధిత ఉన్నతాధికారి ఒకరు చెప్పారు. కాగా జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ సమీపంలో ఒకే ఒక్క (జనరిక్) మెడికల్ షాపు ఉండగా, దానిని ఇటీవల తొలగించారు. దీంతో మెడికల్ షాపుల యజమానులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకున్నా సరే..

డాక్టర్ ప్రిస్క్రిప్షన్ ఉంటేనే డ్రగ్‌ను ప్రజలకు విక్రయించాలి. కానీ అలాంటి నిబంధనలు పాటించకుండానే మెడికల్ షాపుల నిర్వాహకులు అడ్డగోలుగా విక్రయాలు చేస్తున్నారు. అంతేకాకుండా మత్తుకు బానిసైన యువతకు సైతం మత్తు కోసం ప్రిస్క్రిప్షన్ లేకుండా కోరెక్స్ లాంటి డ్రగ్స్‌ను అమ్ముతున్నారు. మెడికల్ షాపు నిర్వహించాలంటే తప్పనిసరిగా ఫార్మసీ చదివి ఉండాలి. కానీ అలాంటి నిబంధలు పాటించకుండా జిల్లాలో ఆర్ఎంపీలు, పీఎంపీలు సైతం మెడిక ల్ షాపులు నిర్వహిస్తూ అడ్డగోలుగా మందులు విక్రయిస్తూ రోగులను దోపిడీకి గురిచేస్తున్నారు.

గ్రామాల అభివృద్ధికి పెద్దపీట

మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు



చాకలి ఐలమ్మ విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే రోహిత్‌రావు, నాయకులు

రామాయంపేట(మెదక్): గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు అన్నారు. శనివారం మండలంలోని దంతేపల్లిలో చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అలాగే రామాయంపేట ఎస్సీ కాలనీ, తొనిగండ్ల, లక్ష్మాపూర్, కాట్రియాల గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మాట్లాడారు. మండల పరిధిలోని పలు తండాల తారు రోడ్ల నిర్మాణానికి రూ. రెండున్నర కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. పది నెలల కాలంలోనే నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు. ఎన్నికల ముందు తాము ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామని చెప్పారు. సన్నరకం ధాన్యానికి రూ. 500 బోనస్ చెల్లిస్తున్నామన్నారు. కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు ఆందోళన చెందవద్దని కోరారు. కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి సుప్రభాతరావు, పీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి రామచందర్‌గౌడ్, రజక సంఘం జిల్లా అధ్యక్షుడు సంగుస్వామి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రమేశ్‌రెడ్డి, కౌన్సిలర్లు యాదగిరి, సుందర్‌సింగ్ పాల్గొన్నారు.

ప్రతీ గ్రామానికి సాగు నీరు

మంత్రి పొన్నం ప్రభాకర్

కోహెడరూరల్(హుస్నాబాద్): ప్రాజెక్టు నీటిని కాలువల ద్వారా ప్రతీ గ్రామానికి సాగు నీరు అందిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మండలంలోని శనిగరం రిజర్వాయర్‌లో 100 శాతం రాయితీపై ఉచిత చేప పిల్లలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బడుగు, బలహీనవర్గాల వారు ఆర్థికంగా ఎదిగేందుకు గతంలో కన్నా ఎక్కువగా చేప పిల్లలను పంపిణీ చేస్తున్నామన్నారు. సిద్దిపేట జిల్లాలో మత్స్య సహకార సంఘాలున్న వాటికే పరిమితం కాకుండా నీటి నిల్వలు ఉన్న దగ్గర కూడా చేప పిల్లలు విడుదల చేయాలని కలెక్టర్ మనుచౌదరికి సూచించారు. బీఆర్ఎస్ హయాం లో గౌరవెల్లి, గండిపల్లి ప్రాజెక్టుల కా లువల పనుల్లో జాప్యం జరిగిందన్నారు. వేగంగా వాటి నిర్మాణ పనులను పూర్తి చేసి నీరు అందిస్తామన్నారు.

ప్రతిపాదనలు సిద్ధం చేయండి

కలెక్టర్ రాహుల్‌రాజ్



మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్‌జోన్: మెదక్ నియోజకవర్గ అభివృద్ధికి శాఖలవారీగా మౌలిక వసతుల కల్పన కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో వివిధశాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వెల్‌కం బోర్డు సరికొత్త ఆలోచనలతో చూపరులను ఆకట్టుకునే విధంగా తయారు చేయించాలన్నారు. ఎనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్లు ఏర్పాటు చేయడంతో పాటు కుక్కలు, కోతుల జంతు జనన నియంత్రణ చర్యలు చేపట్టాలన్నారు. వైద్య కళాశాల ప్రాంగణంలో ఆస్పత్రి, సిబ్బంది వసతి గృహాలకు సంబంధించిన అంచనాలు సిద్ధం చేయాలన్నారు. ఏడుపాయల దేవాలయానికి సంబంధించి రోడ్డు వైడింగ్, హోటల్ అండ్ టూరిజం గెస్ట్‌హౌస్, మెయిన్ రోడ్ నుంచి టెంపుల్ వరకు సెంట్రల్ లైటింగ్ పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేయాలన్నారు. వచ్చే డిసెంబర్ నాటికి మెదక్ చర్చి వందేళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా సంబరాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. అలాగే మెదక్ బస్టాండ్ మోడ్రనైజేషన్, సరికొత్త ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్, మున్సిపాలిటీ పరిధిలో చిల్డ్రన్స్ పార్క్, ఇరిగేషన్ చెరువులు, మినీ ట్యాంక్ బండ్లు, మెదక్ ఫోర్టు అభివృద్ధి, పంచాయతీరాజ్ ఆర్అండ్‌బీ బ్రిడ్జిలు, యువజన క్రీడల నిర్వహణ శాఖ ఆధ్వర్యంలో స్విమ్మింగ్ పూల్ ఏర్పాటు చేసే దిశగా నివేదిక తయారు చేయాలని సూచించారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ ఎల్లయ్య, డీఆర్‌డీఓ శ్రీనివాసరావు, ఆర్అండ్‌బీ, పంచాయతీ రాజ్, ఇరిగేషన్, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఊరూరా ఎర్ర జెండా

- ప్రజా సంఘాలతో కలసి ఐక్య పోరాటాలు
- సీపీఎం రాష్ట్రకార్యదర్శి తమ్మినేని వీరభద్రం



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని

సంగారెడ్డి ఎడ్యుకేషన్: రాబోయే కాలంలో ప్రజా సంఘాలతో కలసి ఐక్య పోరాటాలు చేస్తామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. విద్య, భూమి, ఉపాధి, సామాజిక న్యాయం, స్వయం పోషణ అందరికీ దక్కాలన్నదే కమ్యూనిస్టుల ప్రత్యామ్నాయ విధానమని పేర్కొన్నారు. ఈ విషయం జనవరిలో జరిగే మహాసభల్లో చర్చిస్తామన్నారు. శనివారం సంగారెడ్డిలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాలులో సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆహ్వాన కమిటీని ఎన్నుకున్నారు. అనంతరం తమ్మినేని మాట్లాడుతూ.. ఊరూరా ఎర్ర జెండాను తీసుకెళ్తామన్నారు. ప్రజల బతుకులు మారడానికి, జనం సమస్యల పరిష్కారానికి కమ్యూనిస్టులు చూపుతున్న విధానాలు ప్రత్యామ్నాయం తప్ప ఓట్లు, సీట్ల బలాబలాలు కాదన్నారు. హిందుత్వ స్థాపనే బీజేపీ లక్ష్యమన్నారు. రాజ్యాంగంలో రాసుకున్న సమాన హక్కులు, సమతాభావం, ఆర్థిక, సామాజిక సమానత్వమనేవి మనుధర్మ రాజ్యాంగంలో ఉండవన్నారు. కేసీఆర్ పట్ల ఉన్న వ్యతిరేకతతో కాంగ్రెస్‌ను గెలిపించిన ప్రజలకు ఆ పార్టీ ప్రభుత్వం చేసిందేమీలేదని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరు ఘోరంగా ఉందని విమర్శించారు. ఏడాది పాలనలో రేవంత్‌రెడ్డి ఉచిత బస్సు తప్ప వేటినీ అమలు చేయలేదని తమ్మినేని విమర్శించారు. ప్రభుత్వం పట్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందన్నారు. విదేశీ పెట్టుబడిదారులకు మూసీ భూ ములు, ఫార్మా భూముల్ని కట్టబెట్టేందుకు మూసీ సుందరీకరణ జపం చేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వీరయ్య,జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డీజీ నర్సింహారావు, రాష్ట్ర కమిటీ సభ్యులు జే.మల్లిఖార్జున్, జిల్లా కార్యదర్శులు పాల్గొన్నారు.

కష్టపడి చదివితేనే భవిష్యత్

ట్రైనీ సివిల్ సర్వీస్ అధికారులు

- నర్సాపూర్, రామాయంపేటలో పర్యటన



నర్సాపూర్ రూరల్: అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

నర్సాపూర్ రూరల్: విద్యార్థులు కష్టపడి చదివితే మంచి భవిష్యత్ ఉంటుందని ట్రైనీ సివిల్ సర్వీస్ అధికారులు అన్నారు. శనివారం మండలంలోని గిరిజన గురుకుల పాఠశాల, కళాశాల, అంగన్‌వాడీ కేంద్రం, మున్సిపాలిటీ కార్యాలయాన్ని సందర్శించారు. ముందుగా మున్సిపాలిటీ కార్యాలయంలో ఆయా శాఖల పనితీరు గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యాభ్యాసం, భోజన సదుపాయం వంటి అంశాలపై విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. ప్రణాళికాబద్ధంగా లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని చదివి ఉన్నత శిఖరాల ను అధిరోహించాలని విద్యార్థులకు సూచించారు. మహిళా సంఘ గ్రూపులతో చర్చించి రుణాల చెల్లింపులపై గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ట్రైనీ సివిల్ సర్వీస్ అధికారులు సోను ఫార్మర్ (ఐఆర్ఎస్), అరుణ్ కుమార్‌సింగ్ (ఐపీఎస్), భోసలే అక్షయ్ దినకర్(ఐఎఫ్ఓఎస్), మనీష్ కన్సల్ (ఐఎఫ్ఎస్), కేఎం ప్రియాంక (ఐపీఎస్)తో పాటు మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, ఎంపీడీఓ మధులత, మున్సిపల్ కమిషనర్ రామకృష్ణారావు, మెప్మా పీడీ ఇందిరా, కౌన్సిలర్ రామచందర్, నాయకులు కుమ్మరి నరేష్, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పథకాల అమలుపై ఆరా..

రామాయంపేట(మెదక్): సివిల్ సర్వీస్ అధికారుల బృందం శనివారం రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలో పర్యటించింది. ఈసందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాల అమలు విషయమై సమీక్షించారు. ముందుగా వారు మున్సిపల్ కార్యాలయానికి రాగా చైర్మన్ జితేందర్‌గౌడ్ స్వాగతం పలికారు. అభివృద్ధి పనులకు సంబంధించిన విధి విధానాలను కమిషనర్ వారికి వివరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. నాలుగు రోజుల పాటు మండలంలోని ప్రగతిధర్మారంలో పర్యటించామని తెలిపారు. గ్రామం అభివృద్ధి దిశలో పయనిస్తుందని, ప్రభుత్వ పథకాలు సక్రమంగా అమలవుతున్నాయని పేర్కొన్నారు. కొంతమేర కరెంట్ కోతలు విధిస్తున్నట్లు గ్రామస్తులు తమతో చెప్పారని, ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు సరైన వైద్య సేవలు అందుతున్నాయని చెప్పారు. అనంతరం అధికారుల బృందం బాలికల గురుకుల రెసిడెన్షియల్ స్కూల్‌ను సందర్శించింది.

క్లుప్తంగా

రైస్‌ మిల్లుకు నోటీసులు

డీఎస్‌ఓ తనూజ

దుబ్బాక: సీఎంఆర్‌ బియ్యంను సకాలంలో అందించని దుబ్బాక మున్సిపల్‌ పరిధిలోని లచ్చపేట వార్డులో గల మహేశ్వర రైస్‌ మిల్లుకు శనివారం నోటీసులు అందించినట్లు డీఎస్‌ఓ తనూజ తెలిపారు. 2023 వానాకాలం పంటకు సంబంధించి మహేశ్వర రైస్‌మిల్లు నుంచి ప్రభుత్వానికి మొత్తం 55.91 ఏసీకేల బియ్యం రావాల్సి ఉండగా 38.26 ఏసీకేలు మాత్రమే వచ్చాయన్నారు. మిగితా 17.65 ఏసీకేల బియ్యం (దాదాపు 5 వేల క్వింటాళ్లు) బకాయి పడ్డారన్నారు.ఈ మిల్లుకు సంబంధించి ఇద్దరు భాగస్వాములు మృతి చెందగా మిగితా భాగస్వాముల మధ్య చోటు చేసుకున్న సమస్యల కారణంగా బకాయి పడ్డ బియ్యాన్ని ప్రభుత్వానికి స్వాధీనపర్చలేదన్నారు. 10 మంది భాగస్వాములకు నోటీసులు అందించామని 30లోగా బియ్యం అందించకపోతే వారిపై క్రిమినల్‌ చర్యలు తీసుకుంటామన్నారు. గత వానాకాలానికి సంబంధించి జిల్లాలో 3 లక్షల మెట్రిక్‌ టన్నుల ధాన్యాన్ని కస్టమ్‌ మిల్లింగ్‌కు తరలించగా దాదాపుగా 99 శాతం బియ్యం రికవరీ అయ్యిందన్నారు.

రాష్ట్రస్థాయి ఖో ఖో పోటీలకు విద్యార్థి ఎంపిక



అనిల్‌ను అభినందిస్తున్న పాఠశాల సిబ్బంది

నర్సాపూర్‌ రూరల్‌: రాష్ట్రస్థాయి ఖో ఖో పోటీలకు నర్సాపూర్‌ గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థి అనిల్‌ ఎంపికయ్యాడని ప్రిన్సిపాల్‌ రవి, వైస్‌ ప్రిన్సిపాల్‌ కృష్ణ కిషోర్‌, పీఈటీ లింగం శనివారం తెలిపారు. ఈనెల 28 నుంచి 30 వరకు మహబూబ్‌నగర్‌ జిల్లాలో జరిగే 43వ జూనియర్‌ రాష్ట్రస్థాయి ఖో ఖో పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబర్చి అనిల్‌ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అభినందించారు.

పేకాట స్థావరంపై దాడులు

ఆరుగురు అరెస్ట్‌

పటాన్‌చెరు టౌన్‌: పేకాట స్థావరంపై పోలీసుల దాడులు నిర్వహించిన ఘటన అమీన్పూర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. అమీన్పూర్‌ పరిధిలోని సుల్తాన్పూర్‌ గ్రామ శివారులో గుట్టల్లో కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నారని విశ్వసనీయ సమాచారం అందింది. ఎస్‌ఐ విజయ రావు సిబ్బందితో కలిసి శనివారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఆరుగురు పట్టుబడగా రూ.66,850 నగదు, మూడు కార్లు, రెండు స్కూటీలను స్వాధీనం చేసుకున్నారు. పరారీలో 8 మంది ఉన్నట్లు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పార్క్‌ చేసిన ఆటో చోరీ



చోరీకి గురైన ఆటో

హత్నూర(సంగారెడ్డి): ఆటో చోరీకి గురైన ఘటన హత్నూర మండలం దౌల్తాబాద్‌లో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. దౌల్తాబాద్‌లో నివాసం ఉండే షబ్బీర్‌ అలీ కాసాల గ్రామ శివారులోని సుగుణ పౌల్ట్రీ పరిశ్రమలో డీసీఎం డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇతడు కాసాల గ్రామానికి చెందిన సాయిబాబాకు చెందిన ఆటోను అద్దెకు తీసుకుని నడిపించుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఎప్పటిలాగే దౌల్తాబాద్‌లోని చౌదరి హోటల్‌ పక్కన శుక్రవారం రాత్రి ఆటోను పార్కింగ్‌ చేసి అద్దె ఇంటికి వెళ్లాడు. శనివారం ఉదయం చూసేసరికి ఆటో లేకపోవడంతో ఆందోళన గురై చుట్టుపక్కల వెతికినా కనిపించలేదు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

స్మార్ట్‌ బాయ్స్‌



- కాలంతో పరుగెడుతున్న 'డెలివరీ బాయ్స్‌'
- ఆర్డర్‌ పెట్టిన నిమిషాల్లో ఇంటి ముందుకు



సాక్షి, సిద్దిపేట: డెలివరీ బాయ్స్‌ అంటే కాలంతో పాటు పరుగెత్తుతారు.. రోజుకు 18 గంటలు సేవలందిస్తారు.. కానీ, ఉద్యోగులు కాదు.. కనీస వేతనాలు లెక్కల్లోకే రావు.. బీమాలు, ఉద్యోగ భద్రత లాంటివి ఉండవు.. రోడ్డు ప్రమాదంలోనో, అనారోగ్య కారణాలతోనో చనిపోతే వారి కుటుంబాలు రోడ్డుపాలవుతాయి. ప్రభుత్వాలు, పని చేయించుకుంటున్న సంస్థలు ఆదుకోవు. ఇదీ.. ఫుడ్‌ ఆర్డర్‌ చేయగానే నిమిషాల్లో డెలివరీ చేసే గిగ్‌ వర్కర్స్‌ దుస్థితి. వీరే కాదు.. ఈ కామర్స్‌ సంస్థలకు సంబంధించిన హోం డెలివరీలు చేసేవారు, బైక్‌లపై ప్యాసింజర్లను తీసుకెళ్లేవారి పరిస్థితి ఇంతే..

ఎవరీ గిగ్‌ వర్కర్‌లు

ఈ కామర్స్‌ వంటి సంస్థల్లో తాత్కాలిక ఉపాధి అవకాశాలు పొందేవారిని 'గిగ్‌' వర్కర్స్‌ అంటారు. 20వ శతాబ్దంలో జాజ్‌ యాస నుంచి గిగ్‌ అనే పదం పుట్టింది. పేరుకు గిగ్‌ సేవా రంగం పరిధిలో ఉన్నప్పటికీ.. వీళ్ల ఉద్యోగులా? వ్యాపారులా? భాగస్వాములా? కార్మికులా ఇలా వీళ్లకు గుర్తింపు లేదు. ఆ కంపెనీలలో డెలివరీ పార్ట్‌ నర్స్‌గా మాత్రమే పరిగణిస్తున్నారు.

రాజస్థాన్‌లో ఇలా..

కేంద్ర ప్రభుత్వం పేర్కొన్న సోషల్‌ సెక్యూరిటీ కోడ్‌ను రాజస్థాన్‌ రాష్ట్రం మాత్రమే అమలు చేస్తోంది. అక్కడ 3 లక్షల మంది గిగ్‌ వర్కర్స్‌ ఉండగా.. 'రాజస్థాన్‌ ప్లాట్‌ఫామ్‌ బేస్ట్‌ గిగ్‌ వర్కర్స్‌ సోషల్‌ సెక్యూరిటీ అండ్‌ వెల్ఫేర్‌ ఫండ్‌'ను ప్రకటించి, రూ.200 కోట్ల నిధులను కేటాయించింది. ప్రతీ ఫుడ్‌, ఈ కామర్స్‌ డెలివరీ, బైక్‌ రైడ్‌కు రూ.2 విధిస్తున్న ప్రభుత్వం, ఆ నిధులను వెల్ఫేర్‌ ఫండ్‌లో జమ చేస్తోంది. ఆ ఫండ్‌ ఆధారంగా గిగ్‌ వర్కర్ల కోసం ప్రత్యేక పథకాలను అమలు చేస్తోంది. అదే విధంగా మన రాష్ట్రంలో సైతం అమలు చేసి డెలివరీ బాయ్స్‌కు అండగా నిలువాలని కోరుతున్నారు.

క్షేత్రస్థాయిలో ఇబ్బందులు

అడ్రస్‌ లభించక.. బైక్‌ రిపేర్‌కు వచ్చి.. పెట్రోల్‌ అయిపోయి.. ట్రాఫిక్‌ ఇబ్బందులు, సరైన రోడ్డు లేక ఆలస్యమైతే వినియోగదారుల నుంచి తిట్లు, నెగిటీవ్‌ ఫీడ్‌ బ్యాక్‌లు తప్పవు. ఇంత లేటా? అడ్రస్‌ ఒక్కసారి చెబితే అర్థం చేసుకోలేవా.. అంటూ అప్పుడప్పుడూ అసహనం వ్యక్తం చేస్తుంటారు. ఒక్కోసారి ఆర్డర్‌ బుక్‌ చేసి తర్వాత వినియోగదారులు ఫోన్‌లు లిఫ్ట్‌ చేయకపోవడం సైతం వీరికే ఇబ్బంది. కొన్నిసార్లు కస్టమర్‌ తీసుకోకున్నా ఫుడ్‌కు సంబంధించిన డబ్బులు డెలివరీ బాయ్‌ల మీదనే పడుతుంది.

డ్రైవింగ్‌ లైసెన్స్‌ అర్హతగా..

డ్రైవింగ్‌ లైసెన్స్‌, సొంత వాహనం ఉంటే చాలు.. ఈ సంస్థలు ఉపాధి కల్పిస్తున్నాయి. ఉద్యోగాల కోసం ప్రయత్నించి, విసిగిపోయిన చాలా మంది ఫుడ్‌ డెలివరీ, బైక్‌ రైడర్స్‌గా పనిని ఎంచుకుంటున్నారు. ఒక్కో ఆర్డర్‌కు చొప్పున డబ్బులను, రోజుకు 8 గంటలు లోకేషన్‌ ఆన్‌ చేసుకొని ఉంటే కొంత బోనస్‌ సైతం అందిస్తున్నారు. కొందరు ఒకరి కింద పని చేయడం ఎందుకని ఫుడ్‌ డెలివరీ, బైక్‌ రైడర్స్‌గా పని చేసేందుకు మక్కువ చూపుతున్నారు. ఉమ్మడి మెదక్‌ జిల్లా వ్యాప్తంగా 2 వేలకుపైగా మంది వరకు డెలివరీ బాయ్స్‌, బైక్‌ రైడర్స్‌ ఉన్నారు. వారు ఇచ్చే ఆర్డర్‌లను బట్టి ఒక్కొక్కరు సుమారుగా రోజుకు రూ.500లకు పైగా సంపాదిస్తున్నారు.



ర్యాపిడో ద్వారా ప్యాసింజర్‌ను తీసుకెళ్తున్న బైక్‌ రైడర్‌

ఏ పని లభించక...



డిగ్రీ మధ్యలోనే ఆపేశాను. ఏ పని లభించక జోమాటోలో డెలివరీ బాయ్‌గా, అదే విధంగా రాపిడో బైక్‌ రైడర్‌గా చేస్తున్నా.. రెండు యాప్‌లు ఆన్‌ చేసి పెట్టుకుంటాను.. ఏది వస్తే దానికి వెళ్తాను. జొమాటో ఆర్డర్‌ డెలివరీ చేసిన తర్వాత మళ్లీ ఖాళీగా రాకుండా ర్యాపిడో బైక్‌ రైడ్‌ ఏమైనా లభిస్తుందో చూస్తాం. బైక్‌ రైడ్‌ వస్తే ప్యాసింజర్‌ను ఎక్కడ డ్రాపింగ్‌ చేయాలో అక్కడ చేస్తాం. దీంతో కొంత పెట్రోల్‌ సేవ్‌ అవుతుంది.

– ప్రవీణ్‌, సిద్దిపేట, బైక్‌ రైడర్‌

రోజుకు రూ.600



రెండేళ్ల నుంచి ఈ కామర్స్‌లో డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నా. ఒక్కో పార్సల్‌కు రూ. 12 చొప్పున సంస్థ అందజేస్తుంది. నాకున్న పరిధిలో ఎంత దూరమైన దానిని డెలివరీ చేసి రావాలి. ఒక్కోసారి తీరా వాళ్ల ఇంటి దగ్గరకు వెళ్లిన తర్వాత ఫోన్‌ లిఫ్ట్‌ చేయరు. చూసి చూసి వెనక్కి వచ్చేస్తాం. మళ్లీ కాసేపటికి ఫోన్‌ చేస్తే తిరిగి వెళ్లి ఆర్డర్‌ను డెలివరీ చేస్తాం.. ఇలా రోజుకు రూ.600 వరకు సంపాదిస్తున్నా.. రూ.150 వరకు పెట్రోల్‌కు ఖర్చు కాగా రూ.450 మిగులుతాయి.

– రవీందర్‌ రెడ్డి, ఈ కామర్స్‌ డెలివరీ బాయ్‌

ప్రభుత్వం ఆదుకోవాలి



కస్టమర్‌ ఇంటి అడ్రస్‌ లభించక. ట్రాఫిక్‌ జామ్‌తో డెలివరీ లేట్‌ అయితే మా చార్జెస్‌ సైతం వేస్తారు. రోజంతా కష్టపడి చేసిన డబ్బులు చార్జెస్‌ రూపంలో పోయిన ఘటనలున్నాయి. రాత్రి సమయంలో ఆర్డర్‌ చేసిన వారు ఫోన్‌లు లిఫ్ట్‌ చేయకపోతే 40 నిమిషాల పాటు అక్కడే వెయిట్‌ చేసి ఆర్డర్‌ రద్దు చేసుకొని వచ్చి మళ్లీ రెస్టారెంట్‌లో ఫుడ్‌ను అప్పగించాలి. 15 రోజుల కిందట ఫుడ్‌ డెలివరీ ఇచ్చేందుకు వెళ్తుంటే బ్లాక్‌ ఆఫీస్‌ చౌరస్తా వద్ద యాక్సిడెంట్‌ అయింది. దీంతో నా బైక్‌ హెడ్‌ లైట్‌ పగిలిపోయింది. మళ్లీ నా డబ్బులు పెట్టి రిపేర్‌ చేయించుకున్నాను. ప్రభుత్వం డెలివరీ బాయ్‌లను ఆదుకోవాలి.

– జగదీశ్‌, డెలివరీ బాయ్‌



సిద్దిపేటలో ఈ-కామర్స్‌ సంస్థకు చెందిన డెలివరీలు ఇచ్చేందుకు బయలుదేరుతున్న డెలివరీ బాయ్స్‌



ఫుడ్‌ డెలివరీ చేస్తున్న బాయ్‌

డెలివరీ బాయ్స్‌ను కలుసుకొని కష్టాలు తెలుసుకొని

కోఫ్లి సెంటర్‌ ఫర్‌ ఇంటెలిజెన్స్‌ సిస్టమ్స్‌లో ప్రొఫెసర్‌ నిమ్మి రంగస్వామి, పరిశోధక విద్యార్థి తన్మయి గోయల్‌లు హైదరాబాద్‌, చెన్నై, ముంబయిల్లో వేల మంది ఫుడ్‌ డెలివరీ బాయ్‌లను కలుసుకొని కష్టాలు అడిగి తెలుసుకున్నారు. వారు గిగ్‌ వర్కర్ల జాబితాలో ఉన్నా, కార్మిక చట్టాలు డెలివరీ బాయ్స్‌కు వర్తించడం లేదని గుర్తించారు. ఈ అధ్యయనం కొద్దిరోజుల కిందట అంతర్జాతీయ జర్నల్‌లో ప్రచురితం కాగా, బార్సిలోనాలో ఇటీవల జరిగిన యూరోపియన్‌ అసోసియేషన్‌ ఆఫ్‌ సోషల్‌ ఆంత్రోపాలజిస్ట్‌ సదస్సులో ప్రత్యేకంగా దీనిపై ప్రస్తావించారు.

అక్రమ నీటి తరలింపును అడ్డుకోండి

ఆర్డీఓకు హల్దీవాగు పరివాహక ప్రాంత రైతులు ఫిర్యాదు



ఆర్డీఓకు ఫిర్యాదు చేస్తున్న రైతులు

తూప్రాన్‌: పట్టణ సమీపంలోని కిష్టాపూర్‌ హల్దీవాగు గడ్డర్‌ లిఫ్ట్‌ ఇరిగేషన్‌ నుంచి అక్రమంగా మోటార్లతో నీటి తరలింపును అడ్డుకోవాలని ఆర్డీఓ జయచంద్రారెడ్డికి శనివారం రైతులు ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మండలంలోని యావపూర్‌ గ్రామ శివారులో సుమారు 90 ఎకరాల భూమిని మల్లారెడ్డి అనే వ్యక్తి గతంలో ఖరీదు చేశారన్నారు. హల్దీవాగు నుంచి మోటార్ల ద్వారా అక్రమంగా నీటిని తరలిస్తున్నారని తెలిపారు. ఈ భూమి మాజీ సీఎం కేసీఆర్‌ బంధువు కన్నారావు అనే వ్యక్తికి చెందిందని మల్లారెడ్డి తమపై బెదిరింపులకు పాల్పడుతున్నాడని పేర్కొన్నారు. అక్రమంగా నీటిని తరలించడం ద్వారా ఈ ప్రాంత రైతులకు అన్యాయం జరుగుతుందని, వెంటనే అడ్డుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు.

ఐదుగురి ఆర్‌ఎంపీ ఆస్పత్రులు సీజ్‌



ఆస్పత్రిని సీజ్‌ చేస్తున్న వైద్యాధికారి

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మండలంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ఆర్‌ఎంపీల ఆస్పత్రులను డీఎంహెచ్‌ఓ ఆదేశాల మేరకు మండల వైద్యాధికారి మధుకర్‌ సీజ్‌ చేశారు. శనివారం మండలంలోని అన్నారం, బొంతపల్లి, దోమడుగు గ్రామాల్లో నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న ఐదుగురి ఆర్‌ఎంపీల ఆస్పత్రులను గుర్తించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మధుకర్‌ మాట్లాడుతూ.. ఆర్‌ఎంపీ ఆస్పత్రుల్లో కేవలం ప్రథమ చికిత్స అందించాలని, అలా కాకుండా ప్రసవాలు, ఆపరేషన్లు వైద్య సేవలు అందిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొంతమంది ఆర్‌ఎంపీలు యథేచ్ఛగా వైద్య చికిత్సలు చేయడం తమ దృష్టికి వచ్చిన నేపథ్యంలో డీఎంహెచ్‌ఓ సూచన మేరకు చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఈఓ శ్రీనివాస్‌, హెల్త్‌ అసిస్టెంట్‌ సుబ్రహ్మణ్యం, వైద్య సిబ్బంది ముజీబ్‌ తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకొని విద్యార్థి ఆత్మహత్య



మనోజ్‌ (ఫైల్‌)

చేర్యాల(సిద్దిపేట): ఉరేసుకొని విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల పరిధిలోని శభాష్‌గూడెంలో చోటు చేసుకుంది. కొమురవెల్లి ఎస్‌ఐ రాజు కథనం మేరకు.. గ్రామానికి చెందిన గాడిపల్లి నర్సింహులు కుమారుడు గాడిపల్లి మనోజ్‌ (14) పట్టణ కేంద్రంలోని వికాస్‌ గ్రామర్‌ స్కూల్‌లో 8 వ తరగతి చదువుతున్నాడు. శుక్రవారం సాయంత్రం పాఠశాల నుంచి ఇంటికొచ్చిన విద్యార్థి బావి వద్దకు వెళ్లి మామిడి చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి తన కుమారుడు కడుపునొప్పి భరించలేక ఆత్మహత్య చేసుకున్నాడని కొమురవెల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఇది ఇలా ఉంటే స్థానికులు మాత్రం పాఠశాలలో పరీక్ష రాసే సమయంలో కాపీ కొడుతుండగా మనోజ్‌ దొరికిపోయాడని, ఈ విషయాన్ని ఉపాధ్యాయులు తండ్రి నర్సింహులుకి చెప్పగా పాఠశాలకు వచ్చిన తండ్రి విద్యార్థుల ముందు దండించడంతో మనస్తాపం చెంది ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడని చర్చించుకుంటున్నారు.

భార్య కాపురానికి రావడం లేదని యువకుడు



సాయి(ఫైల్‌)

మర్కూక్‌(గజ్వేల్‌): ఉరేసుకొని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల కేంద్రమైన మర్కూక్‌లో శనివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ దామోదర్‌ కథనం మేరకు.. మర్కూక్‌ గ్రామానికి చెందిన నీల సాయి (23)కి రెండేళ్ల కిందట భవానీతో వివాహమైంది. సాయి తరచూ మద్యం సేవించి భార్యతో గొడవపడుతుండటంతో భవానీ తల్లి దండ్రులు వచ్చి పుట్టింటికి తీసుకెళ్లారు. దీంతో మనస్తాపం చెంది ఉరేకున్నాడు. శనివారం చుట్టుపక్కల వారికి సాయి ఇంట్లో నుంచి దుర్వాసన రావడంతో తలుపులు తెరిచి చూసేసరికి ఉరేసుకొని కనిపించాడు. రెండు రోజుల కిందటే ఉరేసుకొని ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతుడి భార్య భవానీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి



శివమల్లు మృతదేహం

నిజాంపేట(మెదక్‌): చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి చెందిన ఘటన నిజాంపేట మండల పరిధిలోని తిప్పన్నగుల్ల గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. తిప్పన్నగుల్ల గ్రామానికి చెందిన బొమ్మ శివమల్లు(45) వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం చేపల వేటకు హైదర్‌ చెరువుకు వెళ్లి తిరిగి రాలేదు. ప్రమాదవశాత్తు నీట మునిగి చనిపోయాడు. భార్య బలవ్వ బంధువులతో కలిసి చెరువులో వెతుకుతుండగా శనివారం ఉదయం చెరువులో మృతదేహం కనిపించింది. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాస్‌ రెడ్డి తెలిపారు.

సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగికి రూ.20.60 లక్షలు బురిడీ

ఆన్‌లైన్‌ ట్రేడింగ్‌ పేరిట సైబర్‌ మోసం

పటాన్‌చెరు టౌన్‌: నకిలీ ఆన్‌లైన్‌ ట్రేడింగ్‌ పేరిట సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగికి బురిడీ కొట్టించి భారీగా నగదు కాజేశారు. ఈ ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పటాన్‌చెరు డివిజన్‌ పరిధిలోని ఓ కాలనీకి చెందిన సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగికి సెప్టెంబర్‌ 23వ తేదీన ట్రేడింగ్‌కు సంబంధించి మెసేజ్‌ వచ్చింది. లింకును ఓపెన్‌ చేసి తన వివరాలను నమోదు చేశాడు. ట్రేడింగ్‌ నిర్వాహకులు ఐడీని క్రియేట్‌ చేసి ఇచ్చారు. బాధితుడు ఆన్‌లైన్‌లో పెట్టుబడి పెడుతూ వచ్చాడు. పలు దఫాలుగా మొత్తం రూ.20 లక్షల 60 వేలు పెట్టుబడి పెట్టాడు. తాను పెట్టిన నగదుతోపాటు, వచ్చిన లాభాలు ఇవ్వాలని అడుగగా స్పందించలేదు. బాధితుడు తాను మోసపోయినట్లుగా గుర్తించి ముందుగా సైబర్‌ క్రైమ్‌ పోలీసులకు ఫిర్యాదు చేసి, అనంతరం పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. శనివారం పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పట్టపగలే ఇంట్లో చోరీ



తాళం పగులగొట్టిన దొంగలు

చిన్నశంకరంపేట(మెదక్‌): పట్టపగలే ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మిర్జాపల్లి గ్రామానికి చెందిన చెరుకు శ్రీనివాస్‌ శనివారం మధ్యాహ్నం భోజనం చేసి మూడు గంటల సమయంలో ఇంటికి తాళం వేసి ధాన్యం కల్లం వద్దకు వెళ్లాడు. సాయంత్రం ఇంటికి వచ్చి చూసేసరికి గొళ్లెం పగులగొట్టి ఉంది. అనుమానంతో ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలో బంగారం కనిపించలేదు. 4.5 తులాల బంగారు ఆభరణాలు నెక్లెస్‌, కమ్మలు బుట్టాలు, వంకు ఉంగరం, ముక్కుపుడుక, 35 తులాల వెండి కడియాలు చోరీ అయినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పత్తిలో గంజాయి మొక్కలు సాగు



నిందితుడు, గంజాయి మొక్కలతో ఎక్సైజ్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ అధికారులు

వట్‌పల్లి(అందోల్‌): మండల పరిధిలోని ఉసిరికపల్లి గ్రామంలో శనివారం ఎక్సైజ్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ అధికారులు దాడులు నిర్వహించి గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నారు. జోగిపేట ఎక్సైజ్‌ సీఐ సాగర్‌ రెడ్డి కథనం మేరకు.. గ్రామానికి చెందిన మన్నె విఠల్‌ పత్తిలో అంతర పంటగా గంజాయి సాగు చేస్తున్నట్లు సమాచారం అందింది. ఈ మేరకు మెదక్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ ఎక్సైజ్‌ సీఐ వీణారెడ్డి ఆధ్వర్యంలో ఎస్‌ఐ అనిల్‌తో పాటు సిబ్బంది దాడులు నిర్వహించారు. 16 కిలోల ఎండు గంజాయితోపాటు అంతర పంటగా సాగవుతున్న 17 గంజాయి మొక్కలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు సీఐ తెలిపారు. గంజాయి విలువ సుమారుగా రూ.2.5 లక్షలు ఉంటుందని తెలిపారు.

భక్తులు జారిపడితే నాకేంటి..

ఏడుపాయల్లో ఈఓ నిర్లక్ష్య వైఖరి



పడిపోయిన భక్తులను లేపుతున్న తోటి భక్తులు

పాపన్నపేట(మెదక్‌): మంజీరా వరదల కారణంగా ఏడుపాయల్లో దేవాదాయ శాఖ కార్యాలయం ముందు భక్తులు జారి పడుతున్నా ఈఓ చంద్రశేఖర్‌ నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలతో ఏడుపాయల్లో కొన్ని ప్రాంతాల్లో వరదలు పోటెత్తాయి. దీంతో మంజీరా తీర ప్రాంతాలు పాకూరుపట్టగా, నీటిలో కాళ్లు కడుక్కుందామని వెళ్లిన భక్తులు ఎంతో మంది జారిపడి గాయాలపాలయ్యారు. పది గజాల దూరంలో ఉండి కూడా ఈఓ కనీస చర్యలు చేపట్టలేదు. పాకూరు తొలగించే ప్రయత్నం చేయకపోగా, బారికేడ్లు ఏర్పాటు చేసి భక్తులు అక్కడకు వెళ్లకుండా జాగ్రత్తలు కూడా తీసుకోలేదని బాధితులు వాపోయారు.

లారీ, బైక్‌ ఢీ : ఒకరికి గాయాలు

పెద్దశంకరంపేట(మెదక్‌): లారీ, బైక్‌ ఢీకొని ఒకరికి గాయాలు ఈ ఘటన పెద్దశంకరంపేట శివారులో శనివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. సంగారెడ్డి జిల్లా మనూరు మండలం శెల్గిరా గ్రామానికి చెందిన కూనింటి ప్రభాకర్‌ బైక్‌పై పెద్దశంకరంపేట వైపు నుంచి అల్లాదుర్గం వైపు వెళ్తుండగా మలుపు స్పీడ్‌ బ్రేకర్‌ వద్ద ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో ప్రభాకర్‌కి తీవ్ర గాయాలయ్యాయి. హైవే అంబులెన్స్‌లో సంగారెడ్డి ఆస్పత్రికి తరలించారు.

పశువులకు గాలికుంటు టీకాలు

- జిల్లాలో కొనసాగుతున్న శిబిరాలు
- ప్రతి ఆరు నెలలకు ఒకసారి వ్యాక్సినేషన్‌
- ఆన్‌లైన్‌ లో వివరాల నమోదు
- సద్వినియోగం చేసుకోవాలని అధికారుల సూచన



పశువులకు టీకాలు వేస్తున్న జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి, తదితరులు(ఫైల్‌)

సంగారెడ్డి జోన్‌: పశువులకు గాలికుంటు వ్యాధి రాకుండా ముందస్తు చర్యలో భాగంగా చర్యలు తీసుకుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న పశువులకు వ్యాధి నివారణ చర్యలో భాగంగా జిల్లా పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో గాలి కుంటు టీకాలు పంపిణీ చేస్తున్నారు. జిల్లాలో బృందాలుగా ఏర్పడి ఈనెల 14 నుంచి టీకాల పంపిణీ కార్యక్రమం కొనసాగుతోంది, పశుపోషకులు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకొని, గాలికుంటు వ్యాధి రాకుండా ఉండేందుకు ముందస్తుగా టీకాలు తప్పనిసరిగా వేయించాలని అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

- జిల్లా వ్యాప్తంగా మొత్తం 3,25,277 పశువులు ఉన్నాయి. అందులో 1,56,282 ఆవులు, 1,68,995 గేదెలు ఉన్నాయి. వీటిలో వ్యాక్సినేషన్‌ వేసేందుకు 1,69,455 పశువులను గుర్తించారు.
- జిల్లాలో 72 బృందాలుగా ఏర్పడి, ప్రతిరోజు గ్రామాలలో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి ఉచితంగా వ్యాక్సినేషన్‌ చేస్తున్నారు. జిల్లాకు 1,59,750 వ్యాక్సినేషన్‌లు వచ్చాయి.
- ఈనెల 15న ప్రారంభమై నవంబర్‌ 14వ తేదీ వరకు గాలికుంటు నివారణ టీకాల పంపిణీ కార్యక్రమం కొనసాగుతోంది. ఇప్పటివరకు జిల్లాలో 46,856 పశువులకు గాలికుంటు టీకాలు వ్యాక్సినేషన్‌ చేసినట్లు అధికారులు వెల్లడించారు.
- టీకాలు వేసిన పశువులకు 12 అంకెలతో పాటు బార్‌ కోడ్‌ కలిగిన ట్యాగ్‌లను వేస్తున్నారు. ఇంతకుముందే ట్యాగులు ఉంటే ఎగ్జిస్టింగ్‌ ట్యాగ్‌గా గుర్తిస్తున్నారు.
- అదేవిధంగా పశువులకు వ్యాక్సినేషన్‌ అనంతరం పశువురకంతో పాటు యజమాని తదితర వివరాలను భారత్‌ పశుధన్‌ ఆన్‌లైన్‌ పోర్టల్‌లో నమోదు చేస్తున్నారు.

జిల్లాలో ఉన్న పశువులు

ఆవులు	1,56,282
గేదెలు	1,68,995
మొత్తం	3,25,277
జిల్లాలోని వ్యాక్సినేషన్‌ వేయాల్సిన పశువులు	1,69,455
జిల్లాలోని వ్యాక్సినేషన్‌ పూర్తి అయిన పశువులు	46,856

సద్వినియోగం చేసుకోవాలి



వ్యాధి నివారణ చర్యల్లో భాగంగా గ్రామాలలో నిర్వహించే ఉచిత పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి. పశు పోషకులు తమ వద్ద ఉన్న పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయించాలి. గాలికుంటు వ్యాధి సోకకుండా ముందస్తు చర్యలో భాగంగా వ్యాక్సినేషన్‌ వేస్తున్నాం.

–డాక్టర్‌ ఎం.వసంత కుమారి, జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి